ఈనాడు అన్నమయ్య

సోమవారం అక్టోబరు 21, 2024 5

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల, డివిజన్ స్థాయిలో కూడా అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు తీసుకుంటారన్నారు. అక్కడ పరిష్కారం కాని సమస్యలకు సంబంధించిన అర్జీదారులు మాత్రమే జిల్లా కేంద్రానికి తరలి రావాలని ఆయన పేర్కొన్నారు.

పెన్నా చుట్టూ... పచ్చకోక కట్టినట్టు



చుట్టూ పచ్చని కొండలు... మధ్యలో ఒంపులు పోతూ పెన్నా ప్రవాహం... నదీ ప్రవాహానికి ఇరువైపులా పచ్చటి వరిపొలాలు చూపు తిప్పుకోనివ్వని అందాలు ఆప్రాంతం సొంతం... ఆసాంతం చేస్తే మది పరవశించక తప్పదు.. కడప నగర శివారులోని పెన్నా సోయగాలు కోనసీమను తలపించేలా ఎటు చూసినా కనుచూపు మేర పచ్చని తివాచీ పరిచినట్టుగా మారింది. గండికోట, మైలవరం జలాశయాల నుంచి వచ్చే నీటితో పెన్నా పరవళ్లు తొక్కుతుండగా సిద్ధవటం ప్రాంతంలో రైతులు విస్తారంగా వరిసాగు చేయడంతో ఈ సుందర దృశ్యం సాకారమైంది. ఆ చిత్రమే ఇది. **- ఈనాడు, కడప**

రక్షకుడా వందనం...

నీ సేవలు అజరామరం



మన ప్రాణానికి ఆయుష్షు... మాన, ధనానికి శ్రేయస్సు...
మనకు భయమేస్తే ధైర్యం... కష్టమొస్తే స్థైర్యం
తప్పు చేస్తే శిక్ష... ముప్పు వస్తే రక్ష
విధి నిర్వహణలో వీర
మన భద్రతకు ప్రాణాలు లెక్కచేయని ధీర
సంఘానికి రక్షణ... సమాజానికి క్రమశిక్షణ
అక్రమార్కులకు భయం... అమాయకులకు అభయం
చట్టానికి కిరీటం ఆ టోపీ... భరోసాకు లీవి ఆ లాఠీ
దుండగుల పాలిట సింహస్వప్నం...
కనిపించని ఈ నాలుగో సింహం
గుండాల గుండెల్లో కాక ఈ ఖాకీ...
మాకు కష్టం వచ్చినప్పుడు ముందుండి
మా రక్షణ కోసం ప్రాణాలొడ్డే వీరులకు
రాజుల పాలన నుంచి ప్రజాస్వామ్య ప్రభుత్వాల వరకు
సామాన్యులకు రక్షణగా నిలిచిన వీరులందరికీ వందనం... అభివందనం
పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా...

- శాతవాహనుల కాలం నుంచే రక్షణకు పునాది ప్రత్యేక కథనం 6లో...

వీరుడిగా వెళ్లి... విగతజీవిగా మారి



బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టుల బాంబుదాడిలో మృత్యువాత పడిన అమర జవాను కొడవకంటి రాజేష్ పార్థివదేహం ఆదివారం రాత్రి బ్రహ్మంగారిమఠం మండలం తోట్లపల్లె పంచాయతీ, పాపిరెడ్డిపల్లె ఎస్సీ కాలనీకి చేరింది. సైన్యంలో పనిచేస్తున్న రాజేష్ మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమర్చిన బాంబు పేలి అశువులు బాసిన విషయం తెలిసిందే. దేశసేవ చేయాలని సైన్యంలోకి వెళ్లిన తమ కుమారుడు విగతజీవిగా గ్రామం చేరడంతో తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు కన్నీటిపర్యంతమయ్యారు. వారి ఆర్తనాదాలు మిన్నంటాయి. జవాను రాజేష్ భౌతికకాయానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు.



ప్రేమంటే!

బద్వేలు సమీపంలో శనివారం జరిగిన యువతి హత్యోదంతంలో నిందితుడు విఘ్నేష్‌ను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి యువతిని రప్పించి తన కోర్కె తీర్చిన తర్వాత పెట్రోలు పోసి నిప్పంటించినట్లు తేల్చారు.



మృతి చెందిన ఇంటర్ విద్యార్థిని ఆత్మకు శాంతి కలగాలని కడప ప్రభుత్వ బాలుర బీసీ వసతి గృహంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

- గంటల వ్యవధిలోనే పట్టుబడ్డ నిందితుడు
- తప్పించునేందుకు నేరస్థుడి విశ్వ ప్రయత్నాలు
- ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, కడప, న్యూస్‌టుడే, కడప నేరవార్తలు

సంచలనం కలిగించిన ఇంటర్ విద్యార్థి కేసులో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి గంటల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకోగలిగారు. తప్పించుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేసినా వలపన్ని పట్టుకున్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ప్రత్యేక దృష్టి సారించి ఘటనా స్థలానికి స్వయంగా వెళ్లడంతో పాటు సిబ్బందికి తగిన సూచనలు చేసి కేసును తక్కువ వ్యవధిలోనే ఛేదించారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయానికి ఘటన బాహ్య ప్రపంచానికి తెలిసింది. ఈ లోపు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితురాలిని బతికించడానికి అన్ని ప్రయత్నాలు చేయాలని ఆదేశించారు. నిందితుడిని వెంటనే పట్టుకోవాలని సూచించారు. బాలికకు స్థానికంగా చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. పెట్రోలుతో తగులబెట్టిన కారణంగా బాధితురాలి శరీరం 80 శాతం వరకు కాలిపోయినట్లు వైద్యులు గుర్తించారు. చికిత్సకు కోలుకోలేని విద్యార్థిని ఆదివారం వేకువ జామున 2.30 గంటలకు ప్రాణాలు కోల్పోయింది. ఎస్పీ అందించిన సమాచారం మేరకు వివరాలివి...

లైంగిక దాడి... ఆపై పెట్రోల్‌తో నిప్పు

ఇంటర్ యువతిని ప్రేమించిన విఘ్నేష్ మరో మహిళను ఆరు నెలల కింద వివాహం చేసుకున్నారు. దీన్ని జీర్ణించుకోలేని ఆ యువతి తరచూ నిలదీస్తుండేదని పోలీసు విచారణలో నిందితుడు తెలిపారు. ఈ తరుణంలో బాలికను వదిలించుకోవాలనే ఎత్తుగడ వేశాడు. శనివారం ఉదయం ఫోన్ చేసి పీపీ కుంట ప్రాంతానికి రావాలని కోరడంతో పాటు రాకపోతే తాను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో విద్యార్థిని నిందితుడు సూచించిన ప్రాంతానికి ఆటోలో వెళ్లింది. కడపలో హోటల్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్న విఘ్నేష్ ఈ లోపు ద్విచక్ర వాహనంలో బయలుదేరి ముందుగానే సీసాలో పెట్రోలు నింపుకొని జేబులో పెట్టుకుని వెళ్లారు. పీపీ కుంట ప్రాంతంలో అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం తన పెళ్లి విషయమై విద్యార్థిని ప్రశ్నించడంతో తీవ్రంగా దాడి చేయడంతో ఆమె స్పృహ కోల్పోయింది. ఆ తర్వాత పెట్రోల్ చల్లి నిప్పంటించి వెళ్లిపోయినట్లు నిందితుడు పోలీసుల ముందు అంగీకరించాడు. ఈ కేసు నుంచి తప్పించుకోవడానికి నిందితుడు విశ్వప్రయత్నాలు చేసినట్లు పోలీసు విచారణలో తేలింది. తన ఫోన్ తీసుకెళ్లే పక్షంలో కాల్‌డేటా, సిగ్నల్ ఆధారంగా గుర్తించే అవకాశం ఉంటుందని, దాన్ని కడపలో ఉంచి భార్య ఫోన్‌ను వెంట తీసుకెళ్లినట్లు గుర్తించారు. తన ఫోన్‌లోని కాల్ డేటాను తొలగించినట్లు తేలింది. ఆ తర్వాత పీపీ కుంట నుంచి కడప నగరానికి చేరుకున్న నిందితుడు జనంలో కలిసిపోయే ప్రయత్నం చేశారు. నాలుగు బృందాలతో రంగంలోకి దిగిన పోలీసులు సీసీ ఫుటేజ్ పలుచోట్ల సేకరించారు. కడపలోని ఓ పెట్రోల్ బంకులో ద్విచక్ర వాహనానికి పెట్రోల్ నింపుకోవడం, సీసాకు ప్రత్యేకంగా పట్టుకోవడాన్ని గుర్తించారు. ఈ కోవలో కూపీ లాగగా వ్యవహారం బయటపడింది. నేరం జరిగిన ప్రాంతంలో పలు ఆధారాలు సేకరించారు. నిందితుడు, మృతురాలి బట్టలు, విద్యార్థిని తరగతి పుస్తకాలున్న బ్యాగు, సగం కాలిన పెట్రోల్ సీసా, ఘటనా స్థలంలో నిందితుడు తాగిపడేసిన సిగరెట్ పీక సేకరించారు. శనివారం రాత్రే నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు సాంకేతిక వివరాలన్నీ సేకరించిన తర్వాత ఆదివారం అధికారికంగా ప్రకటించారు. ప్రత్యేక బృందాలు నిందితుడిని గంటల వ్యవధిలోనే పట్టుకోవడం, నేరం జరిగిన తీరును గుర్తించగలిగారు. పోలీసుల పనితీరును రాష్ట్ర ప్రభుత్వం ప్రశంసించింది. ప్రత్యేకించి డీజీపీ ద్వారకా తిరుమలరావు అభినందించారు.

రిమ్స్‌లో విషాదం


రిమ్స్ మార్చురీ వద్ద విషాదం నెలకొంది. మృతురాలి తల్లి రోదన అందరి హృదయాలను కదిలించింది. విషాదంలో ఉన్న తల్లి బోరున విలపించింది. నిందితుడిని చంపేయాలంటూ పోలీసులను వేడుకుంది. లేదంటే తానే పెట్రోల్ పోసి చంపేస్తానంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది.



ఉమ్మడి కడప జిల్లాలో ఏటా పిడుగుపాటుకు సరాసరి అయిదుగురు మృత్యువాత పడుతున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఆరుగురు దుర్మరణం పాలయ్యారు.



పిడుగులు పడే ప్రాంతాల గురించి హెచ్చరిస్తూ 30 నిమిషాల ముందే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ చరవాణులకు సందేశం పంపుతోంది. ఇందులో ఏఏ ప్రాంతంలో పిడుగులు పడనున్నాయో లోకేషన్‌తో సహా తెలుగు, ఆంగ్ల భాషల్లో సందేశం పంపుతున్నారు.



- జిల్లాలో ఎక్కువగా రైతులు, పశువుల కాపర్లు, వ్యవసాయ కూలీలు పిడుగుపాటుకు మృత్యువాత పడుతున్నారు.
- నగర, పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నీ పిడుగు పాటుకు గురయ్యే అవకాశం ఉన్నా, పట్టణాలు, నగరాలతో పోలిస్తే గ్రామీణులే ఎక్కువగా బలవుతున్నారు.

పిడుగులపై పిడుగులు!

వర్షాల వేళ తస్మాత్ జాగ్రత్త ● అపార్ట్‌మెంట్లపై రక్షణ పరికరాలు తప్పనిసరి

జిల్లాలో పిడుగులు బెంబేలెత్తిస్తున్నాయి.. కరవుకు మారుపేరు కావడంతో ఇక్కడ ఎండలదే పెత్తనం ఎక్కువ... అయినప్పటికీ అకాల వర్షాలు, తుపానులు, రుతుపవనాల సమయంలో పిడుగులు కబళిస్తున్నాయి. మృత్యువాత పడుతున్న వారంతా రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులే. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాపాయం బారి నుంచి తప్పించుకోవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల పిడుగుపాటుకు ఉమ్మడి కడప జిల్లాలో అయిదుగురు మృత్యువాత పడగా ఆదివారం కంభంవారిపల్లెలో ఒకరు మృత్యువాత పడ్డారు.

కొన్ని ప్రమాద ఘటనల వివరాలివి

- సంబేపల్లె మండలం శెట్టిపల్లెకు చెందిన మహిళలు కూలి పనులకు వెళ్లి బావులకాడపల్లె వద్ద ఈ నెల 7న టమాటాలు కోసి గ్రేడింగ్ చేస్తుండగా వారిపై పిడుగుపడింది. ఈ ఘటనలో శంకరమ్మ (35), మల్లేశ్వరమ్మ (38) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఏడుగురు గాయపడ్డారు.
- వైఎస్ఆర్ జిల్లా పెండ్లిమర్రి మండలం తుమ్మలూరుకు చెందిన శివపార్వతి (30), తేజేశ్వర్‌రెడ్డి (10) ఈ నెల 3వతేదీ పశువులు మేపేందుకు వెళ్లారు. వర్షం రావడంతో చెట్టుకిందకు వెళ్లగా పిడుగుపడి ఇద్దరూ మృత్యువాతపడ్డారు. పగడాలపల్లెకు చెందిన మారుతీప్రసాద్‌రెడ్డి (30) పొలం పనులు చేస్తుండగా పిడుగుపడటంతో మృతి చెందారు. మరో వ్యక్తి షాక్‌కు గురై ఆసుపత్రి పాలయ్యాడు.
- మదనపల్లె మండలం వేంపల్లెకు చెందిన రైతు భాస్కర్‌నాయుడు (45) గతేడాది పొలం నుంచి గడ్డి మోపు తీసుకొస్తుండగా పిడుగుపాటుకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆయనను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది.
- రెండేళ్ల కిందట మదనపల్లె పట్టణ శివారు ఈశ్వరమ్మ కాలనీ సమీపంలోని ఖాళీ స్థలంలో క్రికెట్ ఆడేందుకు కొంత మంది యువకులు వెళ్లారు. ఆడుకుంటున్న సమయంలో వీరు ఉన్న ప్రాంతానికి సమీపంలోనే పిడుగు పడింది. ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు యువకులు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు.
- ఆదివారం పిడుగుపాటుకు గాలివీడు మండలంలోని తూముకుంట పంచాయతీ నాయునివారిపల్లె సమీపంలో 18 పొట్టేళ్లు, కంభంవారిపల్లెలో రెండు పాడిఆవులు చనిపోయాయి.

అపార్టుమెంట్లకు తప్పనిముప్పు

జిల్లాలో గతంలో కంటే ప్రస్తుతం ఎక్కువగా అపార్ట్‌మెంట్ల నిర్మాణం కొనసాగుతోంది. ఒక్క మదనపల్లెలోనే వందకు పైగా బహుళ అంతస్థుల భవనాలు ఉన్నాయి. జిల్లాలో సుమారు 500కు పైగా అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వీటి నిర్మాణాలు చేస్తున్నప్పటికీ వాటికి సరైన భద్రత పాటించడం లేదు. దీని వల్ల ఎత్తులో ఉన్న ఈ భవనాలపై పిడుగు పడే అవకాశాలున్నాయి. రానున్న రోజుల్లో పిడుగుపాటు ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో రాయచోటి, పీలేరు, రాజంపేట, రైల్వే కోడూరు ప్రాంతాల్లో ఏ పట్టణంలో చూసినా వంద వరకు బహుళ అంతస్తులు ఉన్నాయి.

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : వర్షాకాలం వచ్చిందంటే పిడుగుల ప్రభావంతో ఏటా అనేక మంది మృత్యువాత పడుతున్నారు. ప్రస్తుతం తుపాను జిల్లాను కమ్మేయడంతో పిడుగుల భయం వెంటాడుతోంది. వర్షాకాలంతో సంబంధం లేకుండా ఎప్పుడుపడితే అప్పుడు అకాల వర్షాలు కురుస్తుండటంతో పాటు పిడుగులు పడుతుండటంతో పలువురు మృత్యువాత పడుతున్నారు. ప్రకృతి కన్నెర్ర చేస్తుండటంతో కూలీలు, రైతులు ప్రాణాలు కోల్పోతున్నారు. కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధితులు దిక్కుతోచని స్థితిలో దయనీయ పరిస్థితుల్లో ఉన్నారు. తాజాగా కంభంవారిపల్లెలో పిడుగుపాటుకు మరొకరు దుర్మరణం పాలవడంతో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.



భవంతిపై ఏర్పాటు చేసిన లైటెనింగ్ కండక్టర్

లైటెనింగ్ కండక్టర్లతో రక్షణ

ఎత్తైన భవనాలు, పెద్ద చెట్లు పిడుగులను ఎక్కువగా ఆకర్షిస్తాయి. భవన నిర్మాణ సమయంలో నిబంధనలు పాటించాలి. ఎత్తైన భవనాలపై తప్పనిసరిగా లైటెనింగ్ కండక్టర్లు ఏర్పాటు చేసుకోవాలి. దీనిలో పొడవాటి రాగి, ఇత్తడి తీగను భవనం పైభాగాన అమర్చాలి. దాన్ని భూమికి కనెక్షన్ ఇవ్వడం వల్ల విద్యుత్తు తరంగాలను ఆకర్షించి పిడుగుల ప్రభావం భవనాలపై పడకుండా భూమిలోకి పంపుతుంది. దీని వల్ల పిడుగుల నుంచి రక్షణ పొందవచ్చునని నిపుణులు అంటున్నారు.

భర్తను బలితీసుకున్న పిడుగు
భార్య, తల్లికి గాయాలు



కంభంవారిపల్లి: మండలంలోని నూతనకాలవ పంచాయతీ గుట్టలపై ఆదివారం సాయంత్రం పిడుగు పాటుతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. నడింపల్లెకు చెందిన **నాగరాజ** (48) ఆదివారం సాయంత్రం భార్య పార్వతమ్మ, తల్లి చిన్నక్కతో కలిసి గ్రామానికి సమీపంలో వేరుసెనగ పొలంలో పనిచేస్తుండగా వర్షం వచ్చింది. తడవకుండా ఉండటానికి సమీపంలో ఉన్న చింతచెట్టు కిందకు వెళ్లారు. ఈ సమయంలో పిడుగు పడడంతో నాగరాజ అక్కడికక్కడే మృతి చెందగా గాయపడిన పార్వతమ్మ, చిన్నక్కలను తిరుపతి ఆసుపత్రికి తరలించారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. పీలేరు ఆసుపత్రిలో నాగరాజ మృతదేహానికి నివాళులర్పించారు. గాయపడిన వారిని పరామర్శించి మెరుగైన చికిత్స అందివ్వాలని వైద్యులను ఆదేశించారు. ఇదే మండలంలోని తువ్వపల్లె పంచాయతీ చెంచురెడ్డిగారిపల్లెలో రెండు పాడిఆవులు కూడా పిడుగు పడి చనిపోయాయి.

ఇంట్లో ఉండడమే సురక్షితం

తుపానుల వేళ జాగ్రత్తలు తప్పనిసరని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉరుములతో కూడిన పిడుగులు పడుతుంటే ఇంట్లోనే ఉండాలి. పశువులను మేపడం, పొలాల్లో పనిచేయడం, చేపలు పట్టడం, పడవలు నడపడం, ప్రయాణాలు చేయడం మంచిది కాదు. చెరువులు, సరస్సులు, నదులు ఇతర నీటి వనరుల నుంచి వెంటనే బయటకు వచ్చి దూరంగా ఉండాలి. బహిరంగ ప్రదేశాల్లో ఉన్నప్పుడు ఉరుములు ప్రారంభమైతే వెంటనే సురక్షితమైన ప్రాంతాలకు వెళ్లాలి. ఇళ్లు, కార్యాలయాలు, షాపింగ్ కేంద్రాల కిటికీలు మూసి ఉన్న ప్రాంతాల్లో ఉండాలి. ఎత్తైన ప్రదేశాల్లో ఉండకూడదు. పిడుగులు త్వరగా ఆకర్షించే సెల్‌ఫోన్లు, పవర్, మెటల్ కంచెలు, విద్యుత్తు స్తంభాలు, ఎత్తైన చెట్లు, రైలు రోడ్డు ట్రాక్‌లు, విండ్ మిల్లులు, విద్యుత్తు సరఫరా చేసే స్తంభాలకు దూరంగా ఉండాలి. రబ్బరు బూట్లు, కారు టైర్లు పిడుగుల నుంచి రక్షణ అందించవు. అటవీ ప్రాంతాల్లో ఉంటే చిన్నగా ఉన్న చెట్ల కింద ఆశ్రయం పొందాలి. వ్యవసాయ క్షేత్రంలో ఉంటే భూమిపై బంతి ఆకారంలో కూర్చొని చెవులు గట్టిగా మూసుకోవాలి. మెరుపులు వచ్చే సమయంలో అందరూ ఒకేచోట కూర్చోకూడదు. దూరం ఉంటే తీవ్రతను తగ్గించవచ్చు. ఇంట్లో వినియోగించే కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, గేమ్ సిస్టమ్‌లు, టీవీలు, వాషింగ్ యంత్రాలు, ఎలక్ట్రికల్ స్టవ్‌లకు సంబంధించిన ప్లగ్గులు తొలగించాలి. ఇనుప కడ్డీలున్న గొడుగులు వినియోగించకూడదని నిపుణులు చెబుతున్నారు.

ఆ మేఘాలే మృత్యుఘాతాలు

క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడిన సమయంలో తీవ్రమైన గాలులు, ఉరుములు, మెరుపులు వస్తుంటాయి. పిడుగులు పడిన ప్రాంతంలో కొన్ని లక్షల ఓల్టుల విద్యుత్తు తరంగాలు మేఘాల నుంచి భూమిలోకి వస్తాయి. నీటి ఆవిరి ఉన్న మేఘాలు ఒకదానికి ఒకటి ఢీకొట్టడంతో విద్యుత్తు సరఫరా అవుతుంది. ఈ విద్యుత్తే పిడుగుల రూపంలో భూమిపై ప్రసరిస్తుంది.

బ్రౌన్ పునర్జన్మే శాస్త్రి

జిల్లా సాహితీ లోకానికి వరం జానమద్ది



పద్మశ్రీ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, గండ్లూరి దత్తాత్రేయశర్మలను సత్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, పూర్వ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, జానమద్ది కుటుంబీకులు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: సీపీ బ్రౌన్ తాను తలపెట్టిన గ్రంథాలయ స్థాపన యజ్ఞాన్ని జానమద్ది రూపంలో పునర్జన్మ ఎత్తి నెరవేర్చారని... అలా సాహితీ లోకానికి బ్రౌన్ శాస్త్రిగా నామకరణం చేసుకుని జీవితాన్ని చరితార్థం చేసుకున్నారని వక్తలు కొనియాడారు. జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి శతజయంతి వేడుకలు, గ్రంథాలయ, సాహిత్య సేవా పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, గండ్లూరి దత్తాత్రేయ శర్మలకు గ్రంథాలయ, సాహిత్య సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ మాట్లాడుతూ హనుమచ్ఛాస్త్రి చేసిన సేవలను స్మరించుకుంటూ వారి కుటుంబ సభ్యులు ప్రతి ఏటా సాహిత్య, గ్రంథాలయ సేవకులను పురస్కారంతో గౌరవించడం అభినందనీయమన్నారు. జానమద్ది రచయితగా సాహితీ సేవ చేస్తూనే మరోవైపు బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధికి తుదిశ్వాస వరకు కృషి చేశారని కొనియాడారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ 2003లో కడపకు వచ్చినప్పుడు జానమద్దితో ఏర్పడిన పరిచయం ఎప్పటికీ మరిచిపోలేని అనుభూతిని ఇచ్చిందన్నారు. సాహితీవేత్తగా, కడప జిల్లా రచయితల సంఘం కార్యదర్శిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పైనేని తులసీనాదం నాయుడు మాట్లాడుతూ.. హనుమచ్ఛాస్త్రి లాంటి మహోన్నతవ్యక్తుల ప్రేరణతో పుస్తకాలను ముద్రించి విద్యార్థుల్లో భాషా సాహిత్య స్ఫృహను పెంపొందిస్తున్నట్లు తెలిపారు. పురస్కార గ్రహీత పద్మశ్రీ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య మాట్లాడుతూ... 1984లో తాను జానమద్ది హనుమచ్ఛాస్త్రిని కలిసిన విషయాన్ని గుర్తు చేస్తూ, తాను గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం వెనుక ఆయన ప్రేరణ కూడా ఉందన్నారు. మరో పురస్కార గ్రహీత, శతావధాన సామ్రాట్ గండ్లూరి దత్తాత్రేయ శర్మ ప్రసంగిస్తూ జానమద్ది పేరిట పురస్కారాన్ని పొందడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని జానమద్ది సాహితీపీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అలపర్తి పిచ్చయ్యచౌదరి, డాక్టర్ గానుగపెంట హనుమంతరావు, ఇందిరా ప్రియదర్శిని, యలమర్తి మధుసూదనలను సత్కరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, సంస్థ కార్యదర్శి జానమద్ది యామిని, ఎల్.గోవిందరెడ్డి, జింకా సుబ్రహ్మణ్యం, డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి, కొండూరి జనార్దరాజు, భూపతి రాయల్, శ్యామసుందర్‌రెడ్డి, రాజారెడ్డి, కరీముల్లా, కె.రామాంజనేయులు, డాక్టర్ తవ్వా వెంకటయ్య, వై.ప్రభాకరరెడ్డి, జానమద్ది అభిమానులు, సాహితీవేత్తలు, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు. ● సాయంత్రం తెలుగు భాషా వికాస ఉద్యమం ఆధ్వర్యంలో నిర్వహించిన 'భువన విజయం' సాహిత్య రూపకం విశేషంగా అలరించింది.

భాజపా బలోపేతానికి కృషి చేయండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, వేదికపై నాయకులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాష్ట్రంలో అన్నమయ్య జిల్లా ముందుండాలని భాజపా సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఈ మేరకు ఆదివారం మదనపల్లెలో జిల్లా స్థాయి పార్టీ నాయకులతో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కార్యకర్తలు పనిచేయాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసి పార్టీ సభ్యత్వాన్ని ఇవ్వాలన్నారు. గత నెల 10న ప్రారంభమైన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు పనిచేసి పార్టీ సభ్యత్వాన్ని పెంచేందుకు కృషిచేయాలన్నారు. ప్రజలు నరేంద్రమోదీ పరిపాలనపై ఎంతో నమ్మకం ఉంచారన్నారు. గ్రామస్థాయిలో భాజపాను బలోపేతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాజంపేట పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షుడు సాయిలోకేశ్, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు యల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, మదనపల్లె నియోజకవర్గం కన్వీనర్ భగవాన్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చమర్తి జన్మదిన వేడుకలు


తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట పట్టణంలోని తెదేపా పార్లమెంట్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజంపేట నియోజకవర్గంలోని రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, సుండుపల్లి, వీరబల్లి మండలాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలను కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు.

పుష్పగిరిని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి


న్యాయమూర్తికి జ్ఞాపిక అందజేస్తున్న పుష్పగిరి మఠం సిబ్బంది

వల్లూరు, న్యూస్‌టుడే : హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ ఆదివారం పవిత్ర పుణ్యక్షేత్రం పుష్పగిరిని సందర్శించారు. క్షేత్రాధిపతి శ్రీవైద్యనాథేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్న న్యాయమూర్తికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వైద్యనాథేశ్వరస్వామి, శ్రీచక్రసహిత కామాక్షిదేవిలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం పుష్పగిరి పీఠం(మఠం)ను సందర్శించారు. పీఠం సభ్యులు జ్ఞాపికను అందచేసి తీర్థప్రసాదాలను అందించారు. స్థానిక రెవెన్యూ సిబ్బంది పీఠం సభ్యులు పాల్గొన్నారు.

వీరుల గాథలు... వీరగల్లులు

- శాతవాహనుల కాలం నుంచే సంప్రదాయం
- నేటి నుంచి పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు

ములకలచెరువు, న్యూస్‌టుడే: తొలి తెలుగు చక్రవర్తులైన శాతవాహనుల కాలం నుంచే అమరులైన రక్షకులను స్మరించుకునే సంప్రదాయం తెలుగు వారికి ఉంది. ఇందుకు ఎన్నో ఆధారాలున్నాయి. ప్రస్తుతం పోలీసు అమరవీరుల స్మంసరణ దినోత్సవాలకు పూర్తి ఏర్పాట్లు చేస్తుండగా మైసూరు పురావస్తు శాఖ సంచాలకులు మునిత్నరంరెడ్డి అమరవీరులపై జరిగిన పరిశోధనల్లో తెలుగునాట రెండు వేల ఏళ్ల నుంచి ఉన్న రక్షకభట వ్యవస్థ, వీరులను స్మరణ ఉందని తేలినట్లు తెలిపారు. జిల్లాలో తంబళ్లపల్లె ప్రాంతంలో ఇలాంటి వీరశిలలు, శాసనాలు విస్తారంగా ఉన్నట్లు గుర్తించామన్నారు.


పురావస్తుశాఖ అధికారులు సేకరించిన చెరువుకిందపల్లె శాసనం


కత్తి ధరించిన మహిళ

రాజుకు విశ్వాస పాత్రులు వారే

రాజుకు విశ్వాసపాత్రులైన వారు రక్షకభటులుగా నియమించుకునేవారు. సైన్యాధ్యక్షుడిని ముఖ్య మహాతలవరులని నియమించుకునే వారు. పూర్వం రక్షక భటులను తలారులుగా, అరికెలుగా పిలిచేవారు. నిలయాధికారికి (ఎస్.ఐ.) పట్టాలక, పట్టేల అని పేరు. పట్టణం, 300 గ్రామాల వరకు తలవరి ఆధీనంలో ఉండేవి. నేర పరిశోధనల బాధ్యత ఎక్కువగా తలవరిపై ఉండేది. తలవరి ఆధీనంలో తలారులు, పట్టాలకులు, గూఢచారులు పనిచేసేవారు. తలవరులపై అధికారి మహా తలవరి (డీఎస్పీ)ని, రాజులు తమకు విశ్వాసపాత్రులైన వారిని మహాతలవరి పదవుల్లో నియమించేవారు. వారికి బాసటగా అచ్చుకావలివారు, వెలికావలి వారు పట్టణ, గ్రామాల్లో గస్తీ తిరిగేవారు. రాజ్యంలోకి వచ్చే కొత్తవారిపై వీరు నిఘా ఉంచేవారు.

మహిళా రక్షకులు

పూర్వం నుంచే మహిళా రక్షకులూ ఉన్నట్లు తెలుస్తోంది. కత్తి పట్టడం, వివిధ ఆయుధాలు ఉపయోగించడం, యుద్ధ విద్యల్లో ఆరితేరిన వారుగా ఉండేవారు. విజయనగర రాజుల కాలంలో వీరిని అంతఃపుర రక్షకులుగా నియమించేవారు. సోంపాళెం శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో కత్తి ధరించిన రక్షకురాలి శిల్పాన్ని చూడవచ్చు.

- కోటచౌడేశ్వరి ఆలయంపై 11వ శతాబ్దం నాటి చోళరాజుల రక్షకభటుడి విగ్రహం ఉంది. ఈ రక్షక భటుడి దుస్తులు, తలపై టోపీ, చేతిలో ఆయుధం ధరించిన వేషధారణలు పరిశీలిస్తే ఆనాటి రక్షకభటులు ఏ విధంగా ఉండేవారో తెలుస్తోంది.
- ములకలచెరువు మండలం చెరువుకిందపల్లెకు సమీపంలో ఇలాంటి విగ్రహాలు చూడవచ్చు. వీరశిలపై ఆనాటి యుద్ధం గురించిన సమాచారాన్ని శాసనం చెక్కించారు. రామానాయునికోట సమీపంలో అజ్ఞాత వీరుని సమాధిపై అతి పురాతనమైన వీరశిల ఉంది. దీనిపై దేవనాగర లిపిలో శాసనం చెక్కబడి ఉంది. బి.కొత్తకోట మండలం, ఆలేటిపల్లె సమీపంలో ప్రజల రక్షణ కోసం దోపిడీ దొంగలతో పోరాడి అమరులైన రక్షకభటాధికారి సమాధి ఉంది.


ఆంగ్లేయుల కాలం నాటి గ్రామ పోలీసు గుర్తింపు బిల్ల

- ఆంగ్లేయుల పాలనలోనూ రక్షణ వ్యవస్థను పకడ్బందీగా కొనసాగించారు. వారు గ్రామ పోలీసులను ఏర్పాటు చేశారు. అప్పుడు పనిచేసిన వారి ఇంట గ్రామ పోలీసు గుర్తింపు బిల్లలు నేటికి చూడవచ్చు.

స్మారక చిహ్నాలను రక్షిస్తాం



ప్రజల రక్షణ కోసం పోరాడి అమరులైన వీరుల గుర్తులను రక్షించుకోవడం నేటి తరం బాధ్యత. పురాతన కాలం నాటి రక్షకుల గురించి తెలిపే వీరశిలలను కాపాడటం మనందరి ధర్మం. వాటి రక్షణకు చర్యలు తీసుకుంటాం.

- రాజారమేష్, సీఐ, ములకలచెరువు

చెరువుకిందపల్లె సమీపంలో వీరశిల

తెలుగునాట రక్షక భట (పోలీసు) వ్యవస్థకు రెండు వేల ఏళ్ల చరిత్ర ఉంది. తొలి తెలుగు చక్రవర్తులైన శాతవాహనుల కాలం నుంచి రక్షకభట వ్యవస్థ ఉన్నట్లు శిల్పాలు, శాసనాలు ద్వారా వెల్లడవుతోంది. ప్రజల ఆస్తులు, మానప్రాణాల రక్షణకు పోరాడి అమరులైన రక్షకభటుల సమాధులపై వీరగల్లులు (శాసనాలు) ఏర్పాటు చేసే ఆచారం ఉన్నట్లు తెలుస్తోంది. సమాధులపై కత్తి, డాలు పట్టిన వీరుని శిల్పం, నాటి పోరాటం, వీరుల పరాక్రమం గురించి శాసనాలుగా చెక్కించినట్లు పలు ఆధారాలున్నాయి. అమరులైన రక్షక భటుల వీరశిలల వద్ద వీర కొలువులు, సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించే వారని పురావస్తుశాఖ పరిశోధనల్లో తేలింది. పురావస్తుశాఖ సంచాలకులు మునిరత్నంరెడ్డి, బృందంతో కలిసి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో చాలా ప్రాంతాల్లో పరిశోధనలు నిర్వహించారు.

పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగావకాశాలు


మంత్రులు టీజీ భరత్, రాంప్రసాద్‌రెడ్డితో తెదేపా నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, న్యూస్‌టుడే : తంబళ్లపల్లెలో యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ హామీ ఇచ్చినట్లు తంబళ్లపల్లె తెదేపా నేత జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంత్రి టీజీ భరత్ కుమార్తె వివాహ నిశ్చితార్థం ఆదివారం గోవాలో జరిగింది. ఈ వేడుకలకు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, తంబళ్లపల్లె తెదేపా నేత జయచంద్రారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు బి.కొత్తకోట మండలంలోని బడికాయలపల్లె సమీపంలో 2,172 ఎకరాలు, కురబలకోట మండలంలో 600 ఎకరాలు, ములకలచెరువు మండలంలో ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు మంత్రికి జయచంద్రారెడ్డి తెలియజేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ త్వరలో తంబళ్లపల్లెలో యువత వలసలు వెళ్లకుండా ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు.

తెదేపాలో చేరిన వైకాపా సర్పంచి


ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సమక్షంలో తెదేపాలో చేరిన సర్పంచి సుబ్రహ్మణ్యం, వార్డు సభ్యులు

నిమ్మనపల్లె : తెదేపా పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న సంకల్పంతో వైకాపా నాయకుల్లో మార్పు వస్తోందని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం రాచవేటివారిపల్లెలో ఆ గ్రామ సర్పంచి సుబ్రహ్మణ్యంతో పాటు గ్రామ సీనియర్ వైకాపా నాయకులు ఇటుకబట్టీల చంద్రారెడ్డి, గ్రామ వార్డు సభ్యులు చక్రపాణిరెడ్డి, షమీల ఆమె భర్త షరీఫ్ ఎమ్మెల్యే సమక్షంలో తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. మండలంలోని మరో నలుగురు వైకాపా సర్పంచులు తెదేపా వైపు చూస్తున్నట్లు సమాచారం. నాయకులు ఆర్‌జే వెంకటేష్, నరసింహారెడ్డి, శ్రీనివాసులు, ఉదయ్‌కుమార్, మల్లికార్జున, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ఒకటో తేదీనే వేతనాలు


మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, పక్కన యూనియన్ నాయకులు

రాయచోటి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించడం హర్షణీయమని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య పేర్కొన్నారు. రాయచోటిలో ఆదివారం జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దీపావళి కానుకగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 30 శాతం ఐఆర్‌ను మంజూరు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అనుభవజ్ఞుడైన వ్యక్తి ముఖ్యమంత్రిగా వస్తారని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు కోరుకున్నాయన్నారు. పీఆర్‌సీ ఆలస్యమైతే ఐఆర్ ఇచ్చే సంస్కృతిని 1999లో తొలిసారిగా ఉద్యోగుల ప్రయోజనాల కోసం తీసుకొచ్చింది చంద్రబాబునాయుడని ఆయన పేర్కొన్నారు. 2023 జులై నెల నుంచి అమలు కావాల్సిన 12వ పీఆర్‌సీ ఉద్యోగులకు ఇచ్చి హామీ మేరకు తాత్కాలిక భృతి ప్రకటించాలని ఆయన డిమాండు చేశారు. అనంతరం పీఆర్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా సూర్యుడు నాయక్ ఎన్నిక కాగా ప్రధాన కార్యదర్శిగా ఉమామహేశ్వర్, గౌరవాధ్యక్షుడిగా అహ్మద్‌బాషాను ఎన్నుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎన్నికైన యూనియన్ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్, సీపీఎస్ రాష్ట్ర కన్వీనర్ గుజ్జల తిరుపాల్, వైఎస్‌ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరి వెంకటశివారెడ్డి, ఎం.నరసారెడ్డి, పి.మల్లికార్జునరెడ్డి, ఎస్.సాహిబ్‌జాన్, జాకీర్‌హుస్సేన్, సిద్దునాయక్, సురేష్, హుస్సేన్ బాషా, వెంకటసుబ్బారెడ్డి, బాబురెడ్డి పాల్గొన్నారు.

కోతి తెచ్చిన గొడవ.. ఒకరికి కత్తిపోట్లు


కత్తిపోట్లకు గురైన సునీల్‌కుమార్

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: కోతికి అరటి పండు ఇస్తే తినకుండా దాన్ని కింద పడేయడంతో కోపంతో తిట్టిన వ్యక్తిని కోతిని ఆడించే వ్యక్తి కత్తితో పొడిచిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓబులవారిపల్లె మండలం బొంతవారిపల్లెకు చెందిన జవ్వాది లక్ష్మయ్య, రేపూరి సునీల్‌కుమార్, పండుగోల శేఖర్‌లు ఆదివారం రేణిగుంట సమీపంలో కరకంబాడి వద్ద ఉన్న శ్రీకటాపుటాలమ్మ ఆలయాన్ని దర్శించుకునేందుకు వెళ్లారు. అనంతరం రేణిగుంట రైల్వేస్టేషన్లో రైలు ఎక్కి తిరుగు ప్రయాణమయ్యారు. వారు ఎక్కిన బోగీలోనే కోతిని ఆడిస్తూ జీవనం సాగించే రెహమాన్ అనే వ్యక్తి డోర్ వద్ద కోతితో కూర్చుని ఉన్నారు. గమనించిన సునీల్‌కుమార్ కోతికి అరటి పండు ఇవ్వగా అది తినకుండా దాన్ని కింద పడేసింది. దీంతో ఆయన కోతిని తిట్టడంతో రెహమాన్ ఆగ్రహించి వాగ్వాదానికి దిగారు. ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకోగా రెహమాన్ తన వద్ద ఉన్న చాకుతో సునీల్‌కుమార్ వీపు, కడుపు భాగాల్లో పొడిచారు. అనంతరం బాలపల్లె రైల్వేస్టేషన్లో దిగిపోయాడు. బాధితుడు రైల్వేకోడూరు స్టేషన్‌లో దిగి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. ఈ విషయంపై విచారిస్తున్నామని రేణిగుంట రైల్వే ఎస్.ఐ.రవి తెలిపారు. నిందితుడిని బాలాపల్లెలో అదుపులోకి తీసుకున్నామన్నారు. బాధితులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని రైల్వేకోడూరు పోలీసులు తెలిపారు.

సబ్ కలెక్టరేట్ ప్రాంగణంలో కూలిన చింతచెట్టు


రహదారిపై కూలిన చింతచెట్టు


గాయపడిన చంద్రశేఖర్

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : మదనపల్లె సబ్‌కలెక్టరేట్ ఎదుట వందేళ్ల పైబడిన చింత చెట్టు కుప్పకూలింది. ఈ ఘటనలో అటుగా సైకిల్‌పై వెళ్తున్న వృద్ధుడికి తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. ఇటీవల కురిసిన వర్షాలతో ఆదివారం ఉదయం మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో చింతచెట్టు ఒక్కసారిగా రహదారిపై కూలిపోయింది. ఈ సమయంలో లచ్చారెడ్డి వీధికి చెందిన చంద్రశేఖర్ అలియాస్ చంద్రాచారి సైకిల్‌పై పేపరు చదివేందుకు వెళ్తుండగా అయనపై చెట్టుపడింది. ఘటనలో గాయపడిన వృద్ధుడిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెండు కాళ్లు, వెన్నెముక విరిగి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు తిరుపతికి తరలించారు. చంద్రాచారి గతంతో ఆయుర్వేద వైద్యం చేస్తుండేవారు. ప్రస్తుతం వైద్యం నడవక ప్రభుత్వం ఇస్తున్న పింఛనుపై జీవనం సాగిస్తున్నారు. వైద్యానికి ఆర్థిక స్తోమత లేదని ప్రభుత్వ తరుపున ఆదుకోవాలని ఆయన కుమార్తెలు అధికారులను కోరుతున్నారు. పట్టణ నడిబొడ్డులోని చిత్తూరు రహదారిలో ఈ వృక్షం కూలిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో రెవెన్యూ, పోలీసులు, అటవీశాఖ, పురపాలక సంఘం అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని రహదారికి అడ్డంగా ఉన్న చెట్టును తొలగింపు చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అటవీ అధికారుల సంఘం ఎన్నిక

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరులో ఆదివారం ఏపీ జూనియర్స్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నికల ప్రక్రియ జరిగింది. ఎన్నికల అధికారులుగా కడప, చిత్తూరు ఎఫ్‌బీవోలు ఎస్.రాజశేఖర్‌రాజు, కె.ప్రతాప్ వ్యవహరించారు. అధ్యక్షుడిగా కె.శ్రీనివాసులు (ప్రొద్దుటూరు డీఆర్వో), సంయుక్త కార్యదర్శిగా ఎస్డీ.మున్నాఫ్ (ఏబీవో, బద్వేలు) ఏకగ్రీవంగా నియమితులయ్యారు. కార్యదర్శి పదవికి పోటీ పడిన జి.వి.రమణ, ఖాజా చెరో ఒక్కటిన్నర సంవత్సరం పంచుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కరుణాకర్, కోశాధికారిగా ఎన్.పద్మనాభయ్య (ఎఫ్‌బీవో, ముద్దనూరు) గెలుపొందారని వారు వివరించారు.

ట్రిపుల్‌ఐటీ అధ్యాపకుడికి అవార్డు ప్రదానం


అధ్యాపకుడు ప్రభాకర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు, తదితరులు

వేంపల్లె, న్యూస్‌టుడే: ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ రసాయన శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ విరూపాక్షి ప్రభాకర్‌ను ఏపీజే అబ్దుల్‌కలామ్ జాతీయ ప్రతిభా అవార్డు వరించింది. ఈ మేరకు గుంటూరులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు చేతుల మీదుగా అధ్యాపకుడు అవార్డును అందుకున్నారు. విద్యార్థులకు ఈయన అందించిన సేవలను గుర్తించి అవార్డును అందజేశారు.

బరిలో దిగితే పతకమే!

- జాతీయ, రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో విశేష ప్రతిభ
- క్రీడాకోటాలో ప్రభుత్వ కొలువుల సాధనకు యువత సన్నద్ధం

-న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ, రాయచోటి

నేటి యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. పేదరికం లెక్క చేయకుండా తాము అనుకున్న రంగంలో అవకాశాలు అందిపుచ్చుకుంటున్నారు. క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు, వివిధ రంగాల్లో సత్తా చాటేందుకు రాజంపేట యువత సన్నద్ధమవుతున్నారు. బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలో పతకాలు సాధిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.


రాజంపేట క్రీడా మైదానంలో సాధన చేస్తున్న క్రీడాకారులు

రైల్వే ఉద్యోగానికి సన్నద్ధమవుతున్నా...



గత పదేళ్లుగా బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ తీసుకుంటున్నాను. రైల్వే శాఖలో ప్రభుత్వ ఉద్యోగం పొందటానికి పోటీ పరీక్షలను సిద్ధమవుతున్నాను. 2020లో తమిళనాడు రాష్ట్రంలో జరిగిన 65వ సీనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తృతీయ, 2023లో జరిగిన 43వ సౌత్‌జోన్, 2024లో మహారాష్ట్రలో జరిగిన 69వ సీనియర్ నేషనల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచాను. మూడు సార్లు జాతీయ స్థాయి పోటీల్లో రాణించడంతోపాటు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ సత్తాచాటాను. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది. **- షేక్ బావద్దీన్, మన్నూరు**

ఉపాధి కల్పించడమే ధ్యేయం



ఇంజినీరింగ్ చదువుతున్నాను. బాగా చదువుకుని సాఫ్ట్‌వేర్ కంపెనీ స్థాపించి ఉపాధి అవకాశాలు కల్పించడమే నా ధ్యేయం. బాలబ్యాడ్మింటన్ క్రీడపై ఇష్టంతో సత్తా చాటుతున్నాను. 2019లో నెల్లూరు జిల్లాలో జరిగిన సబ్ జూనియర్ క్రీడల్లో పతకం సాధించాను. అదే ఏడాది కృష్ణా జిల్లాలో జరిగిన జూనియర్ అండర్-19లో ప్రథమ స్థానంలో నిలిచాను. 2023లో నెల్లూరు జిల్లా జూనియర్ అండర్-19 పోటీల్లో, చిత్తూరు జిల్లాలో జరిగిన సీనియర్ పోటీల్లోనూ సత్తా చాటాను. 2023లో అనంతపురం జిల్లాలో జరిగిన జూనియర్ ఇంటర్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచాను. ఈ ఏడాది జరిగిన 68వ జూనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్‌లో విజయం సాధించాను. **- ముస్తాక్ షేక్, రాజంపేట**

జాతీయ స్థాయిలో రాణిస్తా



రాజంపేట ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాను. తల్లిదండ్రులు లక్ష్మయ్య, ఝాన్సీల సహకారంతో షేక్ ఇమామ్ దగ్గర నాలుగేళ్లుగా శిక్షణ పొందుతున్నాను. 2022, 2023లలో జిల్లా, రాష్ట్ర, జోనల్ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాను. 2024లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలో జరిగిన అంతర్ జిల్లా సబ్ జూనియర్ పోటీల్లో ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. స్టార్ ఆఫ్ ఆంధ్ర అవార్డు పొందాను. జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో రాణించి ప్రథమ స్థానంలో నిలిచి స్టార్ ఆఫ్ ఇండియాగా నిలవడమే లక్ష్యంగా శిక్షణ తీసుకుంటున్నాను. **- కె. కౌశిక్, రాజంపేట**

పోలీసు ఉద్యోగం సాధించా




రాజంపేట డీఎస్పీ కార్యాలయంలో పోలీసు కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాను. 2009లో రాజస్థాన్‌లో జరిగిన జూనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బంగారు పతకం సాధించాను. 2012లో ఏపీలో జరిగిన సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటి బహుమతి పొందాను. సీనియర్, జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్ని బంగారు పతకాలు సొంత చేసుకున్నాను. క్రీడాకోటాలో పోలీసు ఉద్యోగానికి ఎంపికయ్యాను. క్రీడల్లో రాణిస్తే మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటుంది. **- షేక్ హుస్సేన్, రాజంపేట**

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

భక్తి శ్రద్ధలతో గంధం

ములకలచెరువు, న్యూస్‌టుడే: మత గురువు మహమ్మద్ ముక్తియార్ షా ఖాద్రీ మహబూబె సుబహానీ గంధోత్సవం కదిరి రోడ్డులోని దర్గాలో శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక జీవిత చరిత్రను చదివి వినిపించారు. మహనీయుడు అడుగు జాడల్లో నడవాలని కోరారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దర్గా పరిసరాలను విద్యుత్తు కాంతులతో ప్రత్యేకంగా అలంకరించారు.


గంధోత్సవంలో పాల్గొన్న ముస్లిం పెద్దలు, గురువులు

గుంత... ప్రమాదాల చింత

నీరుగట్టువారిపల్లె పాత ఊరులోని మామిడికాయల మండి నుంచి వెళ్లే మార్గంలో కల్వర్టు దెబ్బతింది. మాయా బజార్, గజ్జలకుంటలకు వెళ్లే ఈ మార్గంలోని మలుపులో ఇటీవల కురిసిన వర్షాలకు మురుగునీటి కాలువపై నిర్మించిన వంతెన కూలి గుంతగా మారింది. రాత్రి వేళల్లో ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలబారిన పడుతున్నారు. గుంతను పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ**



మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

స్పందనకు వందనం

న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

✤ బసినికొండ పంచాయతీ కార్యాలయం కొండవంకలో చెత్తాచెదారం తొలగించారు. పంచాయతీలోని నిమ్మనపల్లె రోడ్డులో ఉన్న ఈ వంకలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తుండటంపై ఈనాడులో ప్రచురితమైంది. పంచాయతీ అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేయించారు.

✤ నిమ్మనపల్లె రోడ్డులో పురపాలక సంఘం అధికారులు విద్యుత్తు దీపాలకు మరమ్మతులు చేయించారు. వీధి దీపాలు వెలగక ఈ ప్రాంత ప్రజలు పడుతున్న అవస్థలపై 'మేమున్నాం.. మీకుతోడుగా'లో భాగంగా సమస్య ప్రచురితమైంది. స్పందించిన అధికారులు మరమ్మతులు చేయించారు.

✤ రస్తాకగినేరులో మురుగునీరు రోడ్డుపైకి వెళ్లకుండా పంచాయతీ అధికారులు తాత్కాలిక పనులు చేశారు. ఈ ప్రాంతంలో మురుగునీరు రోడ్డుపైకి ప్రవహిస్తూ దుర్వాసన వస్తుండటంతో ఈనాడులో ప్రచురితమైంది. అధికారులు స్పందించి తాత్కాలిక పనులు చేపట్టి మురుగు రోడ్డుపైకి వెళ్లకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయించారు.

✤ వేంపల్లె పంచాయతీ బెంగళూరు రోడ్డులో గ్రామ పంచాయతీ కార్మికులు పారిశుద్ధ్య పనులు చేశారు. రోడ్డుపై చెత్తాచెదారంతో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంపై ఈనాడులో కథనం ప్రచురితమైంది. పంచాయతీ అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టి సమస్యను పరిష్కరించారు.

✤ బసినికొండలో కార్మికులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. బసినికొండ ప్రాథమిక పాఠశాల ప్రహరీ వద్ద చెత్తదిబ్బలు పేరుకుపోవడంపై 'ఈనాడు'లో సమస్య ప్రచురితమైంది. స్పందించిన అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టి చెత్తదిబ్బలను డంపింగ్ యార్డుకు ట్రాక్టర్ ద్వారా తరలించారు.

✤ బసినికొండ-1 సచివాలయం ఎదుట విద్యుత్తు స్తంభం చుట్టూ తీగ మొక్కలను తొలగించారు. ఇక్కడ విద్యుత్తు స్తంభాలు, నియంత్రికల చుట్టూ పిచ్చిమొక్కలు ఉండడంపై ఈనాడులో సమస్య ప్రచురితమైంది. విద్యుత్తుశాఖ అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగించారు.

✤ ఉప్పరపల్లెలో అధికారులు తాగునీటిపైపులు మరమ్మతులు చేయించారు. ఇక్కడున్న సమస్యపై మేమున్నాం మీకు తోడుగాలో భాగంగా సమస్య ప్రచురితమైంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించారు.

✤ డ్రైవర్స్‌కాలనీలో కృష్ణాపురంలో పారిశుద్ధ్య కార్మికులు చెత్తదిబ్బలను తొలగింపు చర్యలు చేపట్టారు. ఇక్కడ చెత్తదిబ్బలు పేరుకుపోవడంపై ఈనాడులో సమస్య ప్రచురితమైంది. అధికారులు స్పందించి ట్రాక్టర్ ద్వారా చెత్తకుప్పలను సంపద కేంద్రానికి తరలించారు.

కోమటివానిచెరువు... అభివృద్ధికి దూరం

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : ఏళ్లు గడుస్తున్నా కోమటివాని చెరువు అభివృద్ధి విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. పట్టణం నడిబొడ్డున ఉన్న ఈ చెరువును వినోద కేంద్రంగా తయారు చేస్తే పట్టణ ప్రజలకు ఎంతోగానే ఆహ్లాదాన్ని అందిస్తోంది. పాలకులు, ప్రభుత్వాలు మారినా కోమటివానిచెరువు పరిస్థితి మాత్రం మారలేదు. తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది.

27 ఎకరాల విస్తీర్ణంలో...

మదనపల్లె పట్టణం నడిబొడ్డున ఆర్టీసీ బస్టాండు వెనుక భాగాన కోమటివానిచెరువు 27 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. గతేడాది నుంచి ఈ చెరువు ఆక్రమణకు గురవుతోంది. ప్రస్తుతం 21 ఎకరాల్లో మాత్రమే చెరువు ఉన్నట్లు సమాచారం. పట్టణం మధ్యలో ఉండటంతో ఆక్రమణదారుల కన్ను చెరువుపై పడింది. దీనికి తోడు పట్టణంలోని చికెన్ సెంటర్లు, ఆసుపత్రులు, హోటళ్లు, వ్యాపార సంస్థల నుంచి వెలువడే వ్యర్థాలను కూడా ఈ చెరువులోనే పడేస్తున్నారు. ఇవన్నీ అందులో కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. అలాగే ప్రశాంత్‌నగర్, ఇందిరానగర్‌లో, నీరుగట్టువారిపల్లె, ఎస్‌బీఐ కాలనీల్లో వెలువడే మురుగు ఈ చెరువులోకి వచ్చి చేరుతోంది. దీంతో మరింత దుర్వాసన వస్తోంది.

✤ కోమటివానిచెరువును 15 రోజుల కిందట పురపాలకసంఘం అధికారులు శుభ్రం చేయించారు. ప్రొక్లెయినర్ల ద్వారా అందులోని చెత్తాచెదారాలను బయటకు తీయించారు. డ్రోన్ల సాయంతో చెరువులో ఉన్న నీరు దుర్వాసన రాకుండా మందులు చల్లించారు. కట్టపై ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. అయితే పరిసర ప్రాంతంలోని ఆసుపత్రుల నిర్వాహకులు, చికెన్‌సెంటర్, హోటళ్ల నిర్వాహకులు మళ్లీ చెరువులో వ్యర్థాలను వేస్తున్నారు.


కోమటివానిచెరువు

ఇలా చేస్తే బాగుంటుంది

చెత్తాచెదారం చెరువులోకి వేయకుండా చెరువుకట్ట పొడవునా ఇనుప ఫెన్సింగ్ ఏర్పాటు చేయించాలి. సాయంత్రం సమయంలో పట్టణ ప్రజలు, సీనియర్ సిటిజన్స్ కూర్చోవడానికి, వాకింగ్ చేయడానికి తగిన ఏర్పాట్లు చేయించాలి. కట్టపై ఉన్న రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ప్రస్తుతం కట్ట పొడవునా ఉన్న విద్యుత్తు దీపాలను మరమ్మతులు చేయించడంతో పాటు అదనంగా మరికొన్ని దీపాలు ఏర్పాటు చేయించాలి. చెరువులోకి మురుగు రాకుండా పక్కకు మళ్లించాలి. ఇందులో వర్షం నీరు వచ్చి చేరే విధంగా ఏర్పాట్లు చేయించాలి. ఈ విషయమై కమిషనర్ ప్రమీల మాట్లాడుతూ.. గ్రీన్ అర్బన్ డెవలప్‌మెంటు ద్వారా చెరువును అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. టెండర్లు నిర్వహించి చెరువును వినోదకేంద్రంగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తామన్నారు.

వైభవంగా సుబ్రహ్మణేశ్వరస్వామి కల్యాణం

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : పట్టణ పొలిమేర్లలో వెలసిన సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కృత్తికా నక్షత్రం పురస్కరించుకుని సుబ్రహ్మణేశ్వర స్వామి కల్యాణాన్ని నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయప్రధాన అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, అభిరామ్‌స్వామి, రాజుస్వామి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మురళి, సారధి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


స్వామి వారికి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితుడు

ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ 25న

కలికిరి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అద్దవారిపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈ నెల 25న గ్రామ దేవత ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు గుర్రం వంశీయులు, విశ్రాంత ఉపాధ్యాయులు గుర్రం శ్రీనివాసులురెడ్డి, గుర్రం వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 23న సాయంత్రం గణపతి పూజ, రక్షాబంధనం అంకుర్పారణ, వాస్తుపూజ, అమ్మవారి ఊరేగింపు, 24న ఆలయానికి చేరుకున్న అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, 108 కలశాలతో అష్టోత్తర కలశస్థాపన, క్షీరాభిషేకం, శయ్యదివాసం, వేదపారాయణం, 25న యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

శ్రీరెడ్డెమ్మ దేవతకు వరపడు పూజలు

గుర్రంకొండ, న్యూస్‌టుడే : మండలంలోని చెర్లోపల్లె సమీపంలోని శ్రీ రెడ్డెమ్మ కొండలో వెలసిన సంతాన ప్రదాత శ్రీరెడ్డెమ్మ దేవతకు ఆదివారం వైభవంగా పూజలు జరిగాయి. మహిళలు పుష్కరణిలో స్నానాదులు చేసి తడిబట్టలతో ముడుపులు కట్టి, పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈవో మంజుల, భక్తులు పాల్గొన్నారు.

సత్యసాయి మందిరం వార్షికోత్సవం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోటలోని సత్యసాయి మందిరం తృతీయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత భగవాన్ సాయిరాం అవతార ప్రకటన దినోత్సవాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకుని మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. ఓం కారం, సుప్రభాతంతో పాటు నగర సంకీర్తన కార్యక్రమం జరిగింది. అనంతరం మహానారాయణ సేవ కార్యక్రమం జరిగింది. ప్రత్యేక అలంకరణలో ఉన్న సత్యసాయి భక్తులకు దర్శనమిచ్చారు.

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం


బాలినాయునిపల్లెలో సిమెంటు రహదారి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, నాయకులు

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే : వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్రంలో అన్నిరంగాల్లో గాడి తప్పిన పాలనను చక్కదిద్దే పనిలో ముఖ్యమంత్రి నిమగ్నమయ్యారని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా నిమ్మనపల్లె మండలంలో సిమెంటు రహదారుల పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రాచవేటివారిపల్లె సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత అయిదేళ్ల పాలనలో ఉద్యోగులు జీతాలు కూడా సక్రమంగా ఇచ్చే పరిస్థితి ఉండేది కాదని, అభివృద్ధి ఎక్కడ కనిపించేది కాదని, భూ కబ్జాలు, దౌర్జన్యాలతో ప్రజలు భయం గుప్పిట్లో బతికేవారని ఆరోపించారు. రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని స్పష్టం చేశారు. మండలంలో రూ.1.50 కోట్లతో 40 పనులు చేపడుతున్నట్లు చెప్పారు. రెండో విడతలో మరో రూ.2 కోట్లతో సిమెంటు రహదారులు మురుగుకాలువ పనులకు శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు శ్రీవాణి, ఉషారాణి, సుబ్రమణ్యం, రెడ్డెప్ప, తెదేపా నాయకులు రాజన్న, ఆర్‌జేవెంకటేష్, సుధాకర్‌రావు, రెడ్డెప్పరెడ్డి, మల్లికార్జున, బొమ్మిశెట్టి శంకరయ్య, శ్రీనివాసులురెడ్డి, శ్రీపతి, జయన్న, రమణ, మహమ్మద్‌రఫి, కొత్తపల్లె శంకర, మురళి, జగదీష్, లక్ష్మన్న, మహేష్, ఓబుల్‌రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు పాడి ఆవులు మృతి

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే : పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి చెందిన ఘటన ఆదివారం కంభంవారిపల్లి మండలం తువ్వపల్లె పంచాయతీ చెంచురెడ్డిగారిపల్లెలో చోటుచేసుకుంది. గ్రామంలో రాజారెడ్డికి చెందిన రెండు పాడి ఆవులను ఆయన భార్య ఊరికి సమీపంలో మేపుకుంటూ ఉండగా వర్షం వచ్చింది. తడవకుండా ఉండడానికి చెట్టు కింద కట్టేసి ఇంటికి వెళ్లారు. ఈ సమయంలో పిడుగు పడటంతో రెండు ఆవులు మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ. 1,50,000 ఉంటుందని బాధితుడు వాపోయారు. జీవనాధారంగా ఉన్న పశువులు మృతి చెందాయని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


తువ్వపల్లెలో పిడుగు పాటుకు మృతి చెందిన ఆవులు

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

కంభంవారిపలి, న్యూస్‌టుడే : కంభంవారిపల్లె ఎస్ఐగా చిన్న రెడ్డెప్ప ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

వాల్మీకి సంఘం పట్టణాధ్యక్షుడి ఎన్నిక

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : వాల్మీకి సంఘం పట్టణ అధ్యక్షుడిగా **విష్ణు చైతన్య**ను ఆ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో జరిగిన వాల్మీకుల సంఘం సమావేశంలో ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షులుగా రంజిత్ కుమార్, రాజగోపాల్, కార్యదర్శిగా భరత్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా రమేష్, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



విద్యార్థికి అభినందనలు

అంగళ్లు (కురబలకోట) : అంతర్జాతీయ స్థాయిలో జరిగిన వేదికలో మిట్స్ విద్యార్థి పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. కళాశాల ఈసీఈ విభాగం మూడో ఏడాదికి చెందిన విద్యార్థి మోక్షిత్ దుబాయ్‌లో ఇటీవల జరిగిన ఐఈఈఈ కమ్యూనికేషన్ సొసైటీ స్టూడెంట్ టెక్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొని ప్రసంగించారని తెలిపారు. ఈ వేదికలో వివిధ దేశాలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొనగా, మిట్స్ కళాశాలకు చెందిన విద్యార్థి మోక్షిత్ ఒక్కరే పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థి మోక్షిత్‌ను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ నాదెళ్ల విజయభాస్కర్‌చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల విభాగాధిపతి డాక్టర్ రాజశేఖరన్ అభినందించారు.

పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని వినతి

కురబలకోట, న్యూస్‌టుడే : కడప క్రాస్ పంచాయతీ కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెదేపా బీసీ సెల్ విభాగం జిల్లా కార్యవర్గ సభ్యులు రుద్ర బాలకృష్ణ ప్రభుత్వానికి విన్నవించారు. జాతీయ రహదారిలో మూడు మండలాలకు కేంద్రంగా వెలసిన కడప క్రాస్‌లో గత వైకాపా ప్రభుత్వం పీహెచ్‌సీని మంజూరు చేసినా ఏర్పాటుకు చర్యలు చేపట్టలేదని తెలిపారు. జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో కడప క్రాస్‌లో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోటలోని బెంగళూరు రోడ్డులో హంద్రీ-నీవా కాలువ వద్ద రోడ్డు కుంగిపోయింది. వాహన చోదకులు ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. దీంతో స్థానిక బీసీ కాలనీకి చెందిన యువకులు ప్రమాద హెచ్చరికను తెలియజేస్తూ ఎర్రటి జెండాలను రోడ్డుపై నాటారు. ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా సేవా కార్యక్రమాన్ని యువకులు నిర్వహించారు.

ప్రతిభా పురస్కారం ప్రదానం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోటకు చెందిన భారత్, విద్యార్థి ఉన్నత పాఠశాలల యాజమాన్య కమిటీ డైరెక్టర్ పి.శ్రీనివాసులు, సాంఘిక శాస్త్రంఉపాధ్యాయుడు వినయ్ తేజలకు ఏపీజే అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారాలు దక్కాయి. దక్షిణ ప్రాంతీయ ప్రైవేటు లెక్చరర్లు, ఉపాధ్యాయుల సంస్థ (ఎస్‌పీఎల్‌టీఓ) ఆధ్వర్యంలో గుంటూరులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వీరు జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రాన్ని ఎమ్మెల్సీ లక్ష్మణరావు చేతుల మీదుగా అందుకున్నారు.

210 లీటర్ల నాటుసారా స్వాధీనం

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న 210 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్న సంఘటన మండలంలోని గండబోయనపల్లె పంచాయతీ మేకలవారిపల్లెలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై-2 శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మేకలవారిపల్లెకు చెందిన గురునాథ, రెడ్డెప్ప, నాగరాజులు కలిసి గ్రామంలోని అటవీ ప్రాంతంలో నాటుసారాను తయారు చేసి, అక్రమంగా తరలిస్తున్న 210 లీటర్ల నాటు సారాను దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో గురునాథ్ పోలీసులకు లొంగిపోగా, మిగిలిన ఇద్దరు రెడ్డెప్ప, నాగరాజులు పరారైనట్లు ఎస్సై తెలిపారు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

అమ్మ... భౌబోయ్ వెళ్లేదెలా?

రామసముద్రం పట్టణంలో శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. ఎక్కడ చూసినా గుంపులుగా సంచరిస్తున్నారు. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల కుక్కకాటు సంఘటనలు ఎక్కువయ్యాయి. వీధి కుక్కల బెడదను నివారించాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఈ విషయంపై పశువైద్యాధికారి లారెన్స్‌ను వివరణ కోరగా కుక్కల పునరుత్పత్తిని నియంత్రించడానికి శస్త్రచికిత్సలకు చర్యలు చేపడతామని తెలిపారు. **- న్యూస్‌టుడే, రామసముద్రం**



అడుసు... వేసేదెలా అడుగు?



ఇటీవల కురిసిన వర్షాలకు స్థానిక మార్కెట్ బురదమయంగా మారింది. వాహనాల రాకపోకలతో మార్కెట్ లోపల వ్యాపార సముదాయాల ఎదుట అస్తవ్యస్తంగా ఉంది. ప్రస్తుతం దెబ్బతిన్న కాయలను మార్కెట్ బయట రోడ్డుపైనే వేస్తుండడంతో వాహనాల రాకపోకలతో బురదతో దుర్వాసన వస్తోంది. మార్కెట్‌లో వర్షపునీరు నిలబడకుండా, బురద ఏర్పడకుండా చర్యలు తీసుకుంటామని మార్కెట్‌యార్డు కార్యదర్శి అభిలాశ్ చెప్పారు. **- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ**

ప్రమాదమని తెలిసినా ప్రయాణం

ఈ చిత్రంలో ఒకే ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు అందరూ కుటుంబ బాధ్యతలు మోస్తున్న వారే. అందులోనూ శిరస్త్రాణం ధరించకపోగా పరిమితికి మించి ప్రయాణం చేస్తున్నారు. ప్రమాదమని తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వాల్మీకిపురం పట్టణ నడిబొడ్డున ప్రమాదకరంగా ప్రయాణించారు. **- న్యూస్‌టుడే, వాల్మీకిపురం**



విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

రామసముద్రం, న్యూస్‌టుడే : రామసముద్రం ఉన్నతపాఠశాలలో 1987-88 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం తితిదే కల్యాణమండపంలో ఆదివారం ఘనంగా జరిగింది. పలు ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు 37ఏళ్ల తరువాత సమావేశం అయ్యారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పూర్వ గురువులు సుబ్రహ్మణ్యం, అనంతశేష గోపాలాచారి, కృష్ణవేణి, వరలక్ష్మీలను సన్మానించారు. అనంతరం విందు భోజనం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విజయ్‌కుమార్, వెంకటరమణారెడ్డి, వెంకటరమణ, నారాయణ, రమేష్, రాజప్ప, మధుసూధన్‌రెడ్డి, జయారెడ్డి, మురళీమోహన్, శ్రీనివాసులు, సునితారెడ్డి, రాజేశ్వరి, లీలావతి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.


గురువులతో పూర్వ విద్యార్థులు

జీతాలందక కార్మికుల అవస్థలు

పాఠశాలల ఆయాలు, వాచ్‌మెన్ల దుస్థితి ఇదీ


కలికిరి పాఠశాలలో ఆవరణాన్ని శుభ్రం చేస్తున్న ఆయా

కలికిరి, వాల్మీకిపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, వాచ్‌మెన్లకు నెలలుగా జీతాలందక ఇబ్బందులు పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికలకు కొన్ని రోజుల ముందు తమ గుత్తేదారులకు రూ.వేల కోట్ల బిల్లులు చెల్లించిన అప్పటి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలు వాచ్‌మెన్లకు జీతాలు చెల్లించలేదు. టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్ (టీఎంఎఫ్) నిధులను పక్కదారి పట్టించింది. ఈ ఏడాది మార్చి నుంచి వాచ్‌మెన్లు, ఆయాలకు వేతనాలు చెల్లించకుండా వారిని కష్టాల్లోకి నెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారి గౌరవ వేతనాల చెల్లింపునకు చర్యలు తీసుకుంది. అయితే జులై నుంచి సెప్టెంబరు వరకు వారి వేతనాల బడ్జెట్ విడుదల చేయలేదు.

టీఎంఎఫ్ నిధులు పక్కదారి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అమ్మఒడి పథకం కింద ఇచ్చే రూ.15 వేలులో రూ.2వేలు టీఎంఎఫ్ పేరిట గత వైకాపా ప్రభుత్వం దారి మళ్లించింది. ఆ నిధులు వాస్తవానికి పాఠశాలల శుభ్రతకు వినియోగిస్తే ఆయాలు, వాచ్‌మెన్ల జీతభత్యాలు, స్వచ్ఛతకు ఎలాంటి ఇబ్బందులుండవు. కానీ ఆ నిధులను వేరే అవసరాలకు గత ప్రభుత్వం వినియోగించింది. గత వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఆయాలు, వాచ్‌మెన్ల జీతాలు చెల్లించేందుకు మనసు రాలేదు. కూటమి ప్రభుత్వం మార్చి నుంచి జూన్ వరకు వేతనాలు చెల్లించేందుకు ఇటీవలే నిధులు కేటాయించి వారి బ్యాంకు ఖాతాలో జమ చేసింది. అయితే జులై నుంచి సెప్టెంబరు వరకు వేతనాల బడ్జెట్ విడుదల చేయలేదు. పీలేరు నియోజకవర్గంలో మొత్తం 380 ప్రభుత్వ పాఠశాలలుండగా, 380 మంది ఆయాలు, 250 మంది వాచ్‌మెన్లు ఉన్నారు.

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

పుల్లంపేట, న్యూస్‌టుడే: మారుమూల గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. పుల్లంపేట మండల పరిధిలోని పీవీజీపల్లె, అనంతసముద్రం పంచాయతీలలో ఆదివారం 40 లక్షలతో సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి రహదారి సమస్యలు పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎంపీడీవో పోతుగుంట జయశ్రీ, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

పాఠశాల మార్గం అధ్వానం

ఈ చిత్రంలో కనిపిస్తోంది బోనమల గ్రామ కస్పాలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే మార్గం. ప్రధాన రోడ్డు నుంచే విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. మురుగు కాలువ లేక వీధి అంచున మురుగు పారుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా అధ్వానంగా ఉంటోంది. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
- న్యూస్‌టుడే, చిన్నమండెం


బోనమల ఉర్దూ పాఠశాలకు వెళ్లే వీధి దుస్థితి

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
రాయచోటి : 9703622242
రైల్వేకోడూరు : 7981695235

? : బాలాజీనగర్ మలుపులో చెత్త నిల్వలు పేరుకుపోతున్నాయి. పారిశుద్ధ్య సిబ్బంది తొలగించట్లేదు. తొలగింపునకు చర్యలు తీసుకోవాలి. **- స్థానికులు, బాలాజీనగర్, సుండుపల్లి**

✓: వెంటనే పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి పరిసరాలు శుభ్రం చేయిస్తాం. **- హెచ్.సురేష్‌బాబు, పంచాయతీ ప్రత్యేక అధికారి, సుండుపల్లి, - న్యూస్‌టుడే, సుండుపల్లి**

రోడ్లు గుంతలమయం... ప్రయాణం ప్రాణసంకటం

రాజంపేట డివిజన్‌లో తరచూ ప్రమాదాలు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట డివిజన్ పరిధిలోని గ్రామీణ, రహదారులు, జాతీయ రహదారులు గుంతలమయం కావడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత వైకాపా ప్రభుత్వం రహదారుల మరమ్మతులకు ఒక్క రూపాయి కేటాయించకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. దీంతో నిత్యం ప్రమాదాలు జరిగి వాహనదారులు ఆసుపత్రులకు చేరి నెలలు తరబడి చికిత్సలు పొందుతున్నారు. మరికొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారు. రహదారుల నిర్వహణకు అరకొర నిధులు కేటాయించడంతో అధ్వానంగా మారాయి.


రాజంపేట మండలం మందరం వద్ద ఏర్పడిన భారీగుంత

● కడప-తిరుపతి ప్రధాన పట్టణాలను కలుపుతూ జాతీయ రహదారిని 2001లో రోడ్డును నిర్మించారు. అప్పటి నుంచి నిర్వహణను సక్రమంగా పట్టించుకోకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. కడప నుంచి తిరుపతి వరకు ఉన్న ఈ రోడ్డుపై ప్రతి రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారిపై తరచూ ప్రమాదాలతో దాదాపు 20 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు.


చెయ్యేరు నది వంతెనపై అధ్వానంగా ఇలా...

● నందలూరు గ్రామం వద్ద ఉన్న చెయ్యేరుపై నిర్మించిన వంతెనపై గుంతలు ఏర్పడ్డాయి. మరోవైపు రోడ్డుపై ఉన్న దారంతా ఒక వైపు రావడంతో ఉబ్బిపోయింది. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు నిర్లక్ష్యంగా ఉంటే చెయ్యేరు నదిలో పడిపోయే ప్రమాదం ఉంది.

బోయనపల్లి అన్నయమ్య విగ్రహం వద్ద ఉన్న ప్రధాన రహదారిపై భారీ గుంత ఏర్పడింది. మరమ్మతులు చేపట్టాలని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసకెళ్లినా స్పందించట్లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● రాజంపేట మండలంలోని మందరం గ్రామం వద్ద నెల్లూరు-రాజంపేట ప్రధాన రహదారిపై వర్షంతో గుంతలు ఏర్పడ్డాయి. మదన గోపాలపురం, తాళ్లపాక, చొప్పావారిపల్లి గ్రామ పంచాయతీలకు వెళ్లే రహదారులు రాళ్లు తేలి దారుణంగా తయారయ్యాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనమివ్వాలి

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ కనీస వేతనం అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ డిమాండు చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్‌వాడీలకు వర్తించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైకాపా హయాంలో అంగన్‌వాడీలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సరోజమ్మ, మంజుల, రామకృష్ణ, సాంబశివ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ, వేదికపై నాయకులు

పింఛలో పెరుగుతున్న నీటిమట్టం

సుండుపల్లి, న్యూస్‌టుడే: వై.ఆదినారాయణరెడ్డి పింఛ జలాశయంలో నీటి మట్టం స్వల్పంగా పెరుగుతోంది. ఆదివారం రాత్రికి 981 అడుగులకు చేరింది. జలాశయంలోకి పరిసర ప్రాంతాల వంకల నుంచి 60 క్యూసెక్కుల నీరు చేరుతోందని సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపారు.

'రెవెన్యూ సమస్యలతో రైతులు సతమతం'

వీరబల్లి, న్యూస్‌టుడే: మండలంలోని చాలామంది రైతులు రెవెన్యూ సమస్యలతో సతమతం అవుతున్నారని ఫార్మర్స్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు ఆర్.రాజశేఖర్‌రాజు పేర్కొన్నారు. వీరబల్లిలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఫ్రీహోల్డ్ సర్వే చేపట్టే విధంగా రైతుల ప్రధాన సమస్యలపై చేడితే రైతులకు ఇబ్బందులు తొలిగే అవకాశం ఉందన్నారు. చాలామంది పిత్రార్జిత తదితర భూములకు సంబంధించి రెండు కోట్ల ఖాతా ఉందని.. మిగులు భూములుగా ఉన్నాయని సాకు చూపి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ రైతులు సమస్యలు తీరక కాళ్లరిగేలా తిరుగుతున్నారన్నారు. సానిపాయిలో రీసర్వే చేపట్టి పాస్‌పుస్తకాలు ఇచ్చినా చాలా మందివి వన్‌బీలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

కోదండ రామాలయం మాజీ ఛైర్మన్ మృతికి సంతాపం


సుబ్బానాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జగన్‌మోహన్‌రాజు, చెంగల్రాయుడు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయం ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్, చింతరాజుపల్లె పంచాయతీ మాజీ సర్పంచి, తెదేపా నేత బొడ్డే సుబ్బానాయుడు (74) అనారోగ్యంతో బాధ పడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యులు స్వగ్రామమైన పత్రపల్లికి తీసుకొచ్చారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

సుండుపల్లి, న్యూస్‌టుడే: బూడిదేటివాండ్లపల్లెకు చెందిన సుబ్బలక్షుమమ్మ (65) నరాల వ్యాధితో బాధపడుతూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. సుబ్బలక్షుమమ్మకు మదనపల్లెలో చికిత్స చేయిస్తున్నామని ఆమె కుమార్తె రమాదేవి తెలిపారు. సోమవారం గంగమ్మ తిరుణాల సందర్భంగా ఆలయానికి వెళ్లి రాత్రి ఇంటికి వెళ్లగా అప్పటికే విష ద్రావణం తాగిందని.. వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్సై వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: నందలూరు మండలం టంగుటూరు శివారు చెయ్యేరు నుంచి ఇసుకను అక్రమంగా కడపకు రవాణా చేస్తుండగా ఆదివారం అర్ధరాత్రి తర్వాత దాడులు నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఒంటిమిట్ట పోలీసులు తెలిపారు. టిప్పర్ వాహనంలో అనధికారికంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో కడప-రేణిగుంట జాతీయ రహదారిలో తనిఖీలు చేసినట్లు పోలీసులు వివరించారు. అక్రమంగా తరలిస్తున్నట్లు నిర్ధారించి కేసు నమోదు చేశామన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

సిద్దవటం, న్యూస్‌టుడే : మండలంలోని కనుమలోపల్లి, సంటిగారిపల్లె గ్రామాల్లో ఆదివారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. కనుమలోపల్లికి చెందిన భరత్ అనే వ్యక్తి అదే గ్రామంలోని కడప-చెన్నై జాతీయ రహదారి దాటుతుండగా కారు వేగంగా వచ్చి అతన్ని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. సంటిగారిపల్లెలో ఒక ద్విచక్ర వాహనాన్ని మరొక ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో మూలపల్లె గ్రామానికి చెందిన గంగయ్య, గంగరాజు గాయపడినట్లు పోలీసులు చెప్పారు. చికిత్స కోసం వారిని విడివిడిగా 108 వాహనం ద్వారా వారిని కడప ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు చెప్పారు.

మద్యం సీసాల స్వాధీనం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మంటపంపల్లెలో ఓబయ్య అనే వ్యక్తి నిర్వహిస్తున్న గొలుసు దుకాణంపై ఆదివారం దాడులు నిర్వహించి 25 మద్యం సీసాలు, రాచపల్లెలో సుంకేశుల మరాటి అనే వ్యక్తి నుంచి 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్.ఐ శివప్రసాద్ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని వివరించారు. మండలంలో ఎక్కడైనా అనధికారికంగా గొలుసు దుకాణం నిర్వహిస్తుంటే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

మద్యం దుకాణాల ఏర్పాటుపై చర్యలకు డిమాండు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాలను అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పండుగోల మణి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ అనేక ప్రాంతాలలో పాఠశాలలు, కళాశాలలకు దగ్గరగా ఈ దుకాణాలను ఏర్పాటు చేయడంవల్ల మహిళలు, విద్యార్థులు ఇబ్బందిపడే పరిస్థితులు తలెత్తాయన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు తక్షణం స్పందించి వాటిని వేరే ప్రాంతాలకు తరలించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజశేఖర్, కృష్ణచైతన్య, జయరామయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు మణి, పక్కన సీపీఐ నాయకులు

రైతులకు మెరుగైన సేవలందించాలి

సిద్దవటం: రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని రాజంపేట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు అతికారి కృష్ణ, తెదేపా రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య తెలిపారు. సిద్దవటంలో నిత్యపూజయ్య రైతు ఉత్పత్తుల సేవా సంస్థను వారు ప్రారంభించారు. వ్యవసాయ రంగంలో దళారీ వ్యవస్థను నిర్మూలించి రైతులకు మేలు చేసేలా 2019లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అమలు చేసిన రైతు ఉత్పత్తుల సేవా సంస్థలో రైతులు సభ్యత్వం పొంది వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జనసేన, తెదేపా నాయకులు భవనాశి ఓబులయ్య, గంజి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఘనంగా తెదేపా జిల్లా అధ్యక్షుడి పుట్టిన రోజు


తెదేపా కార్యాలయంలో కేకు కోసి పంచి పెడుతున్న పార్టీ మండలాధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, నాయకులు

వీరబల్లి, న్యూస్‌టుడే: తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు జన్మదిన వేడుకలు ఆదివాకం ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. మండల కేంద్రమైన వీరబల్లిలోని తెదేపా కార్యాలయంలో మండలాధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, పలువురు తెదేపా మండల నాయకులు ఆధ్వర్యంలో కేకు కోశారు. వీరబల్లి సింగిల్ విండో అధ్యక్షుడు కల్లూరి రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. మట్లి ఎల్లంపల్లిలో సర్పంచి నాగార్జునాచారి ఆధ్వర్యంలో నాయకులతో కలిసి కేకు కోసి పలువురికి పంచి పెట్టారు. ఓదివీడులో చమర్తి జగన్‌మోహన్‌రాజు రాజంపేటకు వెళుతుండగా ఉదయం కేకు ఆయనతోనే కోసి పలువురికి పంచి పెట్టారు.

సుండుపల్లి: తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జన్మదినం సందర్భంగా ఆదివారం పార్టీ నాయకులు కేకు కోసి సంబరం చేసుకున్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు ప్రసాదరాజు, టి.శివారెడ్డి, ఎం.శివరాంనాయుడు, తెలుగుయువత నాయకులు పాల్గొన్నారు.

దుకాణాలపై రాళ్లతో దాడి


ఘటనా స్థలంలో విచారిస్తున్న ఎస్సైలు నరసింహారెడ్డి, విశ్వనాథరెడ్డిలు

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలో నూతనంగా ఏర్పాటు చేసిన సెలూన్ దుకాణాలపై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడికి పాల్పడ్డారు. మదనపల్లె రోడ్డులోని ఓ సెలూన్ షాప్‌పై కారులో వచ్చిన వ్యక్తులు రాళ్లు రువ్వడంతో షాపు అద్దాలు ధ్వంసయ్యాయని స్థానికులు పేర్కొన్నారు. అదే రోడ్డులోని మరో టోనీ అండ్ గై సెలూన్ దుకాణంపై దాడికి యత్నించారు. అంతలోనే సమాచారం అందుకున్న పట్టణ ఎస్సై నరసింహారెడ్డి, ట్రాఫిక్ ఎస్సై విశ్వనాథరెడ్డిలు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకోవడంతో దాడికి పాల్పడిన వారు వెళ్లిపోయారు. దుకాణాలలోని సీసీ పుటేజీలను పరిశీలించి దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామని వారు పేర్కొన్నారు. పట్టణంలో ఇటీవల కొత్త దుకాణాల ఏర్పాటుపై స్థానికంగా ఉన్న కొందరు దాడులకు పాల్పడడం, బెదిరింపులకు దిగడంతో పట్టణంలో కార్పొరేట్ దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలు ఏర్పాటుకు ఎవరు ముందుకు రావడం లేదనే విమర్శలున్నాయి. పాలకులు, ఉన్నతాధికారులు చొరవ తీసుకుని పట్టణ అభివృద్ధికి వ్యాపార కేంద్రాల విస్తరణే ప్రధానమనే విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందని పురవాసులు పేర్కొంటున్నారు.

పిడుగుపాటుకు 18 పొట్టేళ్లు మృతి


వివరాలు నమోదు చేస్తున్న వీఆర్వో శ్రీనివాసులు

గాలివీడు, న్యూస్‌టుడే: తూముకుంట పంచాయతీ నాయుని వారిపల్లె సమీపంలో వ్యవసాయ పొలాల్లో ఆదివారం సాయంత్రం పిడుగు పడి 18 పొట్టేళ్లు మృత్యువాత పడ్డాయి. పోషకుడు కుర్రు రామప్పనాయుడు స్పృహ కోల్పోవడంతో వైద్యం కోసం గాలివీడులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా ప్రాంతాన్ని గ్రామస్థులు, వీఆర్వో శ్రీనివాసులు పరిశీలించారు. అదే పంచాయతీ ప్రకాశ్‌నగర్‌కాలనీ సమీపంలో పిడుగు పడటంతో గొర్రెల మంద వద్ద ఉన్న పోషకుడు ఈశ్వరయ్య స్పృహ కోల్పోయారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని వీఆర్వో తెలిపారు. ప్రభుత్వం తరపున నష్ట పరిహారం ఇప్పించి పోషకులను ఆదుకుంటామని రవాణా, యువజన, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హామీ ఇచ్చారు. పొట్టేళ్ల యజమానిని మంత్రి చరవాణిలో పరామర్శించారు. సంబంధిత అధికారులతో చర్చించి బాధితులను సకాలంలో ఆదుకోవాలని కోరారు.

వైభవంగా చౌడేశ్వరి జ్యోతులు


ప్రత్యేక వాహనంపై చౌడేశ్వరి అమ్మవారి ఊరేగింపు

చిన్నమండెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని దిగువగొట్టివీడు గ్రామం రామాపురంలో శనివారం రాత్రి చౌడేశ్వరీదేవీ జ్యోతి ఉత్సవాలు వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. రాత్రికి తొగటవీ రక్షత్రియులతో జ్యోతుల ఊరేగింపు, అమ్మవారి గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. అమ్మవారి పూజల్లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వీరబల్లి: మండలంలోని సంగంవారిపల్లి పంచాయతీలోని రాగిమానుదిన్నెపల్లెలో ఆదివారం చౌడేశ్వరి అమ్మవారిని ప్రత్యేక వాహనంపై అమర్చి పురవీధుల్లో ఊరేగించారు. ముందుగా చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఊరేగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన జ్యోతులతో చేసిన విన్యాసాలు ప్రజల్ని అలరింపజేశాయి. పోలీసులు ఎటువంటి అల్లర్లు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.


పూజలందుకుంటున్న అమ్మవారు


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీదేవి

అమ్మవారికి ప్రత్యేక పూజలు

లక్కిరెడ్డిపల్లె: అనంతపురంలో వెలసిన గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలు అందజేశారు.

పేదల భూముల ఆక్రమణకు యత్నం

చిట్వేలి (పుల్లంపేట), న్యూస్‌టుడే: పేదల భూములను కొందరు ఆక్రమించేందుకు యత్నించారని.. అడ్డుకోవాల్సిన పోలీసులు చోద్యం చూస్తుండిపోయారని సీపీఐ నాయకుడు జ్యోతి చిన్నయ్య ఆరోపించారు. చిట్వేలి మండలం దేవమాచపల్లె ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం కేటాయించిన ఏడు ఎకరాల 20 సెంట్లు భూమిని ఆక్రమించేందుకు కొందరు ఆదివారం యత్నించగా స్థానికులతో కలిసి సీపీఐ నాయకులు అడ్డుకున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పేదల జోలికి వెళ్తే ఊరుకోమన్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలను అడ్డుకోకపోతే నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ విషయంపై తహసీల్దారు మోహన్‌కృష్ణను వివరణ కోరగా అది ప్రభుత్వ భూమని ఎవరైన ఆక్రమించుకుంటే చర్యలు తప్పవన్నారు. ఆక్రమణయత్నం తమ దృష్టికి రాగా వెంటనే నిలుపుదల చేయించామన్నారు.


చిట్వేలి మండలం దేవమాచపల్లెలో పేదల భూముల ఆక్రమణను అడ్డుకుంటున్న స్థానికులు, పోలీసులు

3న విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

కడప విద్య, న్యూస్‌టుడే : అంజుమన్ తరక్కి ఉర్దూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నవంబరు 3న కడప, రాయచోటి, ప్రొద్దుటూరుల్లో ఉర్దూ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు సత్తార్‌ఫైజీ, ప్రధాన కార్యదర్శి సయ్యద్ హిదాయతుల్లా ప్రకటనలో పేర్కొన్నారు. 9, 10 తరగతుల ఉర్దూ విద్యార్థులకు 'మౌలాన ఆజాద్ .. విద్య' అంశంపై, ఇంటర్ ఉర్దూ విద్యార్థులకు 'ఇక్బాల్ .. దేశభక్తి', ఉర్దూ డిగ్రీ విద్యార్థులకు 'ఉర్దూ మీడియం మన బాధ్యతలు', ఎంఏ ఉర్దూ విద్యార్థులకు 'భారతదేశంలో ఉర్దూ భాష.. నేటి తరం' అంశాలపై పోటీలు జరగనున్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 98851 98194 (కడప), 94416 36630 (రాయచోటి), 90000 30768 (ప్రొద్దుటూరు) నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రాయచోటి... సమస్యల్లో మేటి

పట్టించుకోని అధికార యంత్రాంగం


రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: రాయచోటి పేరుకు మాత్రమే జిల్లా కేంద్రం. కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పురపాలక పరిధిలో 34 వార్డులు, సుమారు 31 వేల నివాసాలున్నాయి. లక్షా 20 వేల మంది జనాభా ఉన్నారు. మౌలిక వసతులు మాత్రం అరకొరగానే ఉన్నాయి. ప్రధానంగా తీవ్ర తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నారు.

● రాయచోటిలో తీవ్ర తాగునీటి సమస్య ఉంది. పట్టణ వాసులకు ప్రధాన నీటి వనరు వెలిగల్లు జలాశయం.


కె.రామాపురం వీధిలో పైపులైన్ లీకేజీల నుంచి నీటిని పట్టుకుంటున్న స్థానికులు

పట్టణ ప్రజల అవసరాలకు ప్రతి రోజూ సుమారు 2 కోట్ల లీటర్ల తాగునీరు అవసరమవుతోంది. ప్రస్తుతం వెలిగల్లు జలాశయం నుంచి 90 లక్షల లీటర్ల నీరు మాత్రమే పట్టణానికి సరఫరా చేస్తున్నారు. అసలే పట్టణ అవసరాలకు సరిపడా నీటి సరఫరా జరగడం లేదు. జరుగుతున్న నీటి సరఫరాలో సుమారు 20 శాతం మేర నీరు వృథాగా పోతోంది. ఫలితంగా రోజూ వేల లీటర్ల నీరు వృథా అవుతోంది. పైపులైన్లు పగిలిపోవడం, వాల్వ్‌లు నుంచి లీకేజీలు, ప్రజల నిర్లక్ష్యం కారణంగా నీరు ఎక్కువ వృథా అవుతోంది. లీకేజీలకు సిబ్బంది సకాలంలో మరమ్మతులు చేయడం లేదు. దీంతో పట్టణంలో నీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉంటోంది. వారానికి ఒకసారి కూడ వీధుల్లో నీటిని సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంటోంది.

● పురపాలక పరిధిలో పూర్తి స్థాయిలో మురుగు కాలువల నిర్మాణం చేపట్టకపోవడం, ఉన్నవి దెబ్బతినడంతో ఎక్కడ చూసినా మురుగు నిల్వలే దర్శనమిస్తాయి. మురుగు రోడ్లపై పారుతూ.. ఖాళీ స్థలాల్లో నిల్వ ఉండి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ఎటు చూసినా అపారిశుద్ధ్యం నెలకొని ఉంది. పురపాలక పరిధిలో ఇప్పటి వరకు సుమారు 197 కి.మీ మురుగు కాలువల నిర్మాణం చేపట్టారు. ఇంకా 26 కి.మీ. మేర కాలువల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.


ట్యాంకరు వద్ద నీటిని కొనుగోలు చేస్తున్న పుర వాసులు

మౌలిక వసతుల కల్పనకు కృషి

రాయచోటి పురపాలక పరిధిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నాం. తాగు నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం. కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. పురపాలకలో పారిశుద్ధ్యం మెరుగుకు పటిష్ట చర్యలు తీసుకుంటాం.
- వాసుబాబు, కమిషనర్, రాయచోటి